సర్టిఫికెట్లకు కూటమి పోటు



సచివాలయంలో సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థి(ఫైల్)



జగనన్న సురక్ష గ్రామ సభలో సర్టిఫికెట్లు అందుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

- వైఎస్సార్‌సీపీ పాలనలో ఇంటి వద్దకే సేవలు
- నేడు సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- అవస్థలు పడుతున్న ప్రజలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కనీసం సర్టిఫికెట్లు కూడా సకాలంలో మంజూరు చేయడం లేదు. దీంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన అనే విధానాన్ని తీసుకొచ్చింది. అందులో భాగంగానే విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సర్టిఫికెట్లు ఇంటి వద్దనే పంపిణీ చేసింది. కూటమి సర్కార్ మాత్రం వారాల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటోంది. దీంతో విద్యార్థులకు మళ్లీ సర్టిఫికెట్ల కోసం కష్టాలు మొదలయ్యాయి.

బంగారుపాళెం: వైఎస్సార్‌సీపీ పాలనలో అందించే ప్రతి సేవతో పాటు కొత్త సేవలు తీసుకువస్తామన్న కూటమి ప్రభుత్వం సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేకపోతోంది. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే వచ్చి సేవలు అందించిన వ్యవస్థలన్నింటినీ రద్దు చేసేసింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాక ముందు వరకు పౌరసేవలు పొందాలంటే అష్టకష్టాలు పడేవారు. అన్ని దశల్లోనూ లంచాలు ఇచ్చుకునే పరిస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఐదేళ్లు లంచాలకు తావులేకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా ఇంటి నుంచే పౌరసేవలు పొందారు. అయితే మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కష్టాలు మొదలయ్యాయి. ఇంటివద్ద సేవలు దేవుడెరుగు. కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

సర్టిఫికెట్ల కోసం అవస్థలు

కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తరువాత సర్టిఫికెట్ల కోసం తిప్పలు తప్పడం లేదు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు కులం, నివాసం, ఆదాయం వంటి ధ్రువపత్రాల అవసరం ఉంది. పూతలపట్టు నియోజకవర్గంలోని బంగారుపాళెం, తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు, యాదమరి మండలాల్లో సుమారు 45 మంది విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరికి సకాలంలో సర్టిఫికెట్లు అందక అవస్థలు పడుతున్నారు. గ్రామ సచివాలయం నుంచి మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ వ్యయప్రయాసాలకు గురై ఇబ్బందులు పడాల్సివస్తోంది.

గతంలో గుమ్మం వద్దకే సర్టిఫికెట్లు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ సేవలను ఇంటి ముంగిటకే అందించాలని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పించారు. ఇందు కోసం సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చి, ధ్రువీకరణ పత్రాలు, పింఛన్లు, సంక్షేమ పథకాలు వంటి అన్ని సేవలను గుమ్మం వద్దకే అందించారు. పాఠశాలలు, కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులకు అవసరమైన వివిధ రకాల ధ్రువ పత్రాల పంపిణీపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అధికారులందరూ ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి సర్టిఫికెట్లను అందించారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష

వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయాల పరిధిలో ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలను ప్రతి గడపకు తీసుకువెళ్లడంతో పాటు సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందాలనే లక్ష్యంతో 2023 జూన్ 24 నుంచి జూలై 31వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సచివాలయాల పరిధిలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, మండల అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవసరమైన సేవలను నమోదు చేసుకుని జగనన్న సురక్ష గ్రామ సభల ద్వారా కులం, నివాస, ఆదాయం, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, భూ కొనుగోలు, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్స్ ఉచితంగా అందజేశారు.

వారం రోజులుగా తిరుగుతున్నా



నా కుమార్తెకు కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం వారం రోజులుగా తిరుగుతున్నా. సచివాలయం వద్దకు వెళితే సర్వర్ పనిచేయలేదని చెబుతున్నారు. సర్టిఫికెట్ల కోసం నానా అవస్థలు పడాల్సి వస్తోంది. వారం రోజులుగా తిరుగుతున్నా సర్టిఫికెట్లు మంజూరు కాలేదు. ఇలా ఎన్ని రోజులు తిరగాలో ఎన్ని తిప్పలు పడాలో ప్రజల బాధలను పట్టించుకునే వారు కరువయ్యారు.
– నాగరత్నమ్మ, అక్కంచెరువు, ఐరాల

అందని సురక్ష



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న సురక్ష పేరిట ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. క్లస్టర్ పరిధిలోని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, మండల అధికారులు ఇంటింటికీ వెళ్లి ధ్రువీకరణ పత్రాలు అందజేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ సేవలకు మంగళం పాడింది.
– భారతమ్మ, సర్పంచ్, జిల్లేడుపల్లె

సకాలంలో సర్టిఫికెట్లు అందేవి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా వలంటీర్లే తెచ్చి ఇచ్చేవారు. గ్రామ సచివాలయాలకు వెళ్లినా వెంటనే ఇచ్చేవారు. ప్రస్తుతం సచివాలయాలు, మండల కార్యాయయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. రోజుల తరబడి తిరిగినా పని కావడంలేదు. నా కుమారుడి బర్త్ సర్టిఫికెట్ కోసం కాళ్లు అరిగేలా తిరిగాను. ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలి.
– రమేష్, బంగారుపాళెం

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేద్దాం



పార్టీ నేతలకు దిశానిర్దేశం చేస్తున్న సునీల్‌కుమార్

ఐరాల/బంగారుపాళెం : పూతలపట్టు మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జూన్ 4న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న వెన్నుపోటుదినం విజయవంతం చేద్దామని నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆయన శనివారం కాణిపాకంతోపాటు బంగారుపాళెంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ల ఆధ్వర్యంలో మండల పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో అలవికాని హామీలతో ప్రజలపై వరాలజల్లు గుప్పించారన్నారు. అయితే ఏడాది అయినా ఇంత వరకు ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను నట్టేట ముంచేశారని ధ్వజమెత్తారు. గతంలో జగనన్న కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించారన్నారు.

చౌకదుకాణం ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ సుధాకర్

తవణంపల్లె: తమ పంచాయతీలో చౌకదుకాణం ఏర్పాటు చేయాలని కొండ్రాజుకాలువ గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం పౌరహక్కుల దినం సందర్భంగా కొండ్రాజుకాలువ హరిజనవాడలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ ఎస్సీల పట్ల ఎవరైనా వివక్షతన చూపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమకు దిగువమాఘం సొసైటీలో నిత్యావసర వస్తువులు ఇస్తున్నారని తహసీల్దార్‌కు మొర పెట్టుకున్నారు. తమ పంచాయతీలో 300 మంది కార్డుదారులు ఉన్నామని, సుమారు 2 కిలోమీటర్ల దూరం వెళ్లి నిత్యావసర వస్తువులు తీసుకోవడం చాలా కష్టంగా ఉందని వివరించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ గ్రామంలో చౌకదుకాణం ఏర్పాటుపై జిల్లా అధికారులకు నివేదిక పంపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చిరంజీవి, హెచ్‌సీ అమీర్‌బాషా, వీఆర్‌ఓ రాజేశ్వరి, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

ఆదిత్య వాహనంపై ఇంద్రవరదుడి విహారం



సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న స్వామి వారు

యాదమరి: మండల కేంద్రంలోని ఇంద్రవరదరాజ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం స్వామివారు..ఆరోగ్యప్రదాత, సర్వరోగ నివారకుడు అయిన ఇంద్రవరదుడు సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో విహరించగా వాహనం ముందు భక్తబృందం కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ కోలాహలంగా ఊరేగింపు సాగింది. స్వామివారు మాడవీధుల్లో భక్తులకు అభయ ప్రదానం ఇచ్చారు. రాత్రి ఆదిశేష వాహన సేవలో వరదరాజస్వామి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

నేడు గరుడసేవ

ఇంద్రవరదుని గరుడ సేవ ఉదయం 9 గంటలకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సేవలో అరుదైన కృష్ణ గరుడ పక్షులు గోపుర దర్శనం, స్వామి కర్పూర హారతులను దర్శించే ఆసక్తికర సన్నివేశం కోసం భక్తులు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పొగాకు ఉత్పత్తుల వాడకం ప్రాణాంతకం



గుడిపాలలో పొగాకు వ్యతిరేక దినోత్సవంలో వైద్య సిబ్బంది

గుడిపాల: పొగాకు ఉత్పత్తులైన సిగరేట్, బీడీ, గుట్కా, పాన్ మసాలా తదితరాల వాడకం ప్రాణాంతకమని గుడిపాల, బొమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్లు సంధ్య, రష్మిత అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గుడిపాల, బొమ్మసముద్రం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం పొగాకు ఉత్పత్తుల వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను వాడడం వల్ల నోటి, ఊపిరితిత్తుల కేన్సర్ బారినపడే ప్రమాదం ఉందన్నారు. ప్రమాద తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని నిలిపివేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో పొగాకు ఉత్పత్తుల వాడకానికి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది బాల సూర్యనారాయణ, విజయ, చంద్రశేఖర్, వెంకటేష్, జబసెల్వి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నిత్యావసర సరుకుల పంపిణీ



తహసీల్దార్ సుధాకర్

తవణంపల్లె: మండలంలోని చౌకదుకాణాల్లో ఆదివారం నుంచి రేషన్ కార్డుదారులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తామని తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. మండలంలో 44 చౌకదుకాణాలు ఉన్నట్లు వివరించారు. ఇందులో 16090 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. ఉదయం 8 గంటలకు చౌకదుకాణ డీలర్లు షాపులో ప్రజాప్రతినిధుల సమక్షంలో డీలర్లు నిత్యావసర వస్తువులు పంపిణీ ప్రారంభించాలని ఆదేశించారు. ఉదయం 10 గంటలకు ముత్తరపల్లె చౌకదుకాణంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు.

సుఖీభవ అందక.. దిక్కుతోచక..

- అన్నదాతకు అందని భరోసా
- ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతన్నలు
- చేతిలో పైసా లేక ఆందోళనలో కర్షకులు



ఖరీఫ్ సాగుకు దుక్కి సిద్ధం చేస్తున్న రైతు

ఐరాల: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం పండుగలా ఉండేది. గతంలో సీఎం చంద్రబాబు వ్యవసాయం దండగ అంటూ వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. అన్నట్టుగానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయం దండగలా మారుతోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు రైతు సంక్షేమం కోసం ఏ పథకమూ అమలు చేయడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఖరీఫ్, రబీ సీజన్లు దాటిపోతున్నా రైతులకు సాయం అందక, భరోసా లేక అయోమయంలో ఉన్నారు. మరో 10 రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. చేతిలో పైసా లేక, సేద్యపు పనులు చేసుకోలేక, పెట్టుబడి సాయం కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. ఈ ఏడాది ముందుగానే రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకడంతో వాతావరణ అధికారులు ముందుస్తుగానే వర్షాలు కురుస్తాయని చెబుతున్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతులు వేసవి దుక్కులు పూర్తి చేసి ఖరీఫ్ సేద్యానికి సన్నద్ధమవుతున్నారు. ఈ సమయంలో పెట్టుబడులకు రైతులు చేతుల్లో డబ్బులు లేక అప్పులు చేసేందుకు దారులు వెతుకుతున్నారు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ అందిస్తుందని నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 30 వేల మంది అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

నాడు పండుగ.. నేడు దండగ

గతంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సేద్యం పండుగలా సాగేది. నేడు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక దండగలా మార్చేసింది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే మార్గదర్శకాలను అనుసరించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసేది. రైతులకు అవసరమైన విత్తనాలు రాయితీపై సకాలంలో ఇవ్వడంతో పాటు పెట్టుబడి సాయం అందించేవారు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు రాష్ట్ర ప్రభుత్వం వాటా రైతు భరోసా కింద మొత్తం రూ.13,500 వేలు అందించేవారు. ఈ మొత్తం ఖరీఫ్ ప్రారంభానికి ముందే మే లో రైతు ఖాతాకు జమ చేసేవారు. వీటితో పాటు వైఎస్సార్ పంటల బీమా, పంట రుణాలకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇలా ప్రతి దశలో రైతులకు జగన్ ప్రభుత్వం అందించేదని రైతులు చెబుతున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా వేలమంది రైతులు ప్రతి ఏడాది వివిధ పంటలు సాగు చేస్తారు. రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉండేది. ప్రతి మండలంలో సచివాలయాలకు అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. ఈ కేంద్రాల ద్వారా విత్తనాలతో పాటు పెట్టుబడి సాయం, రైతు భరోసా నేరుగా రైతు ఖాతాలకు జమ చేసేవారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంతవరకు రైతు ఖాతాల్లో ఒక పైసా కూడా జమ కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పుల బాధతో అల్లాడుతున్నాం



ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో పంటలకు గిట్టుబాటు ధర లేక చేసిన అప్పులు తీర్చలేక బాధతో అల్లాడుతున్నం. తిరిగి మళ్లీ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతోంది. పెట్టుబడి సాయం అందలేదు. చేతిలో చిల్లిగవ్వ లేదు. సాగుకు ఎలా సిద్ధం కావాలో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించాలి.
– లోకనాథ్‌రెడ్డి, రైతు, 35 యర్లంపల్లె, ఐరాల

దిక్కుతోచడం లేదు



కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ అమలు చేస్తామని చెప్పి ఏడాది అవుతున్నా అమలు చేయడం లేదు. ఈ ఏడాదైనా పెట్టుబడి సహాయం కింద సుఖీభవ అమలు చేస్తే రైతులకు మేలు చేసిన వారు అవుతారు. చేతిలో పైసా లేదు. పంటలు ఎలా సాగు చేయాలో దిక్కుతోచడం లేదు.
– సురేంద్రయాదవ్, రైతు, ఐరాల

క్లుప్తంగా

హుండీ కానుకల లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం గిరింపేటలోని శ్రీదుర్గాంబ దేవస్థానంలో శనివారం హుండీ లెక్కించారు. ఆలయ అధికారులు కమిటీ సభ్యులు, భక్తుల సమక్షంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కానుకలను లెక్కించారు. హుండీ ద్వారా ఆదాయం రూ.2 లక్షలు వచ్చిందని ఈఓ మునిశేఖర్, చైర్మన్ దినేష్ వెల్లడించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేరిన పాఠ్యపుస్తకాలు



గుడిపాల: బొమ్మసముద్రం కళాశాలకు పాఠ్య పుస్తకాలు చేరినట్లు ప్రిన్సిపల్ సాబ్‌జాన్ తెలిపారు. జూన్ 2వ తేదీ నుంచి కళాశాల ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులందరూ తరగతులకు తప్పకుండా హాజరు కావాలని కోరారు. కళాశాలలో విద్యార్థులకు బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, ఎంఅండ్‌టీ, సెరికల్చర్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కళాశాలలో 100కు 100శాతం ఉత్తీర్ణత సాధించడం గుర్తుంచుకోవాలని చెప్పారు. కళాశాలలో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఆర్‌ఎస్‌కేలకు చేరిన సబ్సిడీ వేరుశనగ



వేరుశనగ కాయలు అన్‌లోడ్ చేస్తున్న కూలీలు

ఐరాల: ఖరీఫ్‌లో రైతులకు అందజేసే సబ్సిడీ విత్తన వేరుశనగ మండలంలోని 10 రైతు సేవా కేంద్రాలకు చేరినట్లు శనివారం ఏఓ వరలక్ష్మి తెలిపారు. మండలానికి 1,100 క్వింటాళ్లు కేటాయించగా, ఇప్పటి వరకు 516 క్వింటాళ్ల వేరుశనగ కాయలు సరఫరా అయ్యాయన్నారు. మండలానికి కే–6 రకం వచ్చినట్లు చెప్పారు. 30 కిలోల విత్తన వేరుశనగ కాయల బస్తాకు రైతులు రూ.1,674 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



మాజీ సర్పంచ్ మూర్తి(ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని మొగిలివెంకటగిరి మాజీ సర్పంచ్ మూర్తి శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మూర్తి (50) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తిరుపతిలో ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మాజీ సర్పంచ్ మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

సూపర్‌స్టార్ కృష్ణకు నివాళి



అన్నదానం చేస్తున్న కృష్ణ అభిమానులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలు చిత్తూరులో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కృష్ణ, మహేష్ బాబు అభిమానులు పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, కొంబు, రావూరి రవి నేతృత్వంలో పలుచోట్ల అన్నదానం చేపట్టారు. గంగనపల్లి సమీపంలో ఉన్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో అభిమానులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ రాజశేఖర్

ఐరాల: విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు తెలుగు పద్యాలు చదివించడం, గణితం, క్విజ్, జీకే, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం తదితర అంశాల్లో మెళకువలు నేర్పించారు. ఆమె మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలు ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపరంగా, వారిలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు గ్రంథాలయాలు వేదికలుగా మారాయన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న పద్మాంజలిదేవి

బంగారుపాళెం: కోవిడ్ ముప్పు పొంచి ఉన్న కారణంగా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ పద్మాంజలిదేవి అన్నారు. శనివారం బంగారుపాళెంలోని సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో గైనిక్ ఓపీ, డెలివరీ వార్డు, ఫార్మసీల్యాబ్, ఫిజియోథెరపీ, డయాలసిస్, క్యాజువాలిటీ, ఎక్స్‌రే విభాగం కేంద్రం, ఐసీటీసీ సెంటర్‌ను పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీషా, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రేషన్ పంపిణీ ప్రారంభం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని కాజూరు డీలర్‌షాపులో ఆదివారం పాతపద్ధతిలో రేషన్ పంపిణీ ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా కార్యక్రమం జరుగుతుందన్నారు.

అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా క్షయ నివారణ అధికారి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని టెలిఫోన్ కాలనీ అర్బన్‌హెల్త్ సెంటర్‌లో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెంటర్ వద్ద తొలుత జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం సెంటర్ ప్రజలకు పొగాకు వాడకంపై కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో డీఐఓ హనుమంతరావు, హెల్త్ ఆఫీసర్ లోకేష్ పాల్గొన్నారు.